
మినీకథ

# టీ కప్పు లేపిన తుఫాన్

-ఎ.వి. రెడ్డి శాస్త్రి



ప్రొఫెసర్ మదన్‌తో సులేఖ మాట్లాడుతోంది. సులేఖ అంటే లాకాయి లూకాయి పిల్లేం కాదు. యూనివర్సిటీ బ్యూటీ. శ్రావ్యమైన కంఠం. మాటల్ని గమ్మత్తు గమ్మత్తుగా విరిచి శృతుల్నెక్కి మాట్లాడుతూ వుంటే వింటున్న వాళ్లంతా సమస్తం మరిచిపోయి చెవులూ కళ్లూ ఆమెకి అప్పగించేసి కూర్చుంటారు. ప్రొఫెసర్ మదన్ ప్రస్తుతం అదే స్థితిలో వున్నారు. కళ్లనీ చేతుల్నీ తిప్పుతూ ఆమె ఏదో చెప్తూంటే ప్రొఫెసర్‌గారు ఇదీ అని చెప్పడానికి చేతుల్నీ తిప్పుతూ ఆమె ఏదో చెప్తూంటే ప్రొఫెసర్‌గారు ఇదీ అని చెప్పడానికి వీల్లేని దివ్యానుభూతిని పొందుతూ అచేతన స్థితిలో వున్న సమయంలో-

"మాస్టారూ... ... ..." అనే పిలుపు.

బాల మురళీ కృష్ణ గాన మాధుర్యంలో తేలియాడుతున్న సదస్యుల మధ్యకి ఓ తుంటరి వెధవ ప్రవేశించి కిరసనాయిల్ డబ్బా మీద దరువు ప్రారంభించినట్టు, మూడో నేత్రం తెరిచిన శివుడిలా ప్రొఫెసర్ మదన్ చూశారు. తపోభంగం చేసిన వాడిలా నిల్చుని వున్నాడు రమణ. చేతులు కట్టుకొని వినయంగా నిల్చున్న వాణ్ణి చూసి 'వెధవ నక్క వినయాలూ వీడూనూ...' అని బయటకు వినబడనివ్వకుండా, చూస్తున్న వాళ్లకి కనబడనివ్వకుండా పళ్లు పటపట కొరికేరు ప్రొఫెసర్‌గారు.

కాని రవణ చూపిస్తున్నది నక్క వినయమేం కాదు. నిజంగానే ఉపాధ్యాయులంటే భక్తి గౌరవాలు వున్న వాడు తెలివైన విద్యార్థి. యూనివర్సిటీఫస్టు కోసం పోటీ పడుతూ వున్న ముగ్గురు నలుగుర్లో రవణ కూడా ఒకడు. తెలివైన వాడైతే కావచ్చుగాక-

ప్రొఫెసర్ మదన్ సులేఖతో మాట్లాడుతూన్నప్పుడు ప్రవేశించడం మాత్రం... ... ...ఎంత మాత్రం తెలివైన పనికాదు. అయితే ప్రొఫెసర్‌గారు సులేఖతో మాట్లాడుతూన్న వైనం రవణకి తెలియదు కదా! ఏదో అర్జెంటుగా రాయవలసిన ఎసైన్‌మెంట్ మీద ప్రొఫెసర్‌గారి ఒపీనియన్ తీసుకున్నట్టు తద్వారా చిన్న భజన చేసినట్టు వుంటుందని జరూరుగా ఇలా వస్తే సిట్యుయేషన్ ఇదీ! పరిస్థితిని చూశాక నాలిక్కరిచేసుకొని "అన్నన్న! పానకంలో పుడకలా వచ్చినట్టున్నానే" అని మనసులో అనుకోక పోలేదు రవణ.

ఇంట్రూజన్‌ని హాలాహలాన్ని మింగినట్టు మింగి కంఠంలో కరకుదనాన్ని గుప్పిస్తూ "ఎస్" అన్నారు మదన్ రవణ వైపు గుర్రుగా చూస్తూ. ఎదురు చూడని ఈ సంక్షోభంతో కన్‌ఫ్యూజ్ అయిపోయిన రవణ భజనపాఠం పూర్తిగా మరిచిపోయి "సార్... ...స్సార్" అని నత్తుకొడుతున్నాడు.

ఇంతలోనే అక్కణ్ణించి పారిపోవడానికి అవకాశం కోసం ఎదురు చూస్తున్న దానిలా చప్పున లేచిపోయి "మరి నే వెళ్లొస్తాను సార్" అని బయల్దేరేసింది సులేఖ. ఆ మాట వినగానే చెప్పలేనంతగా డీలా పడిపోయారు ప్రొఫెసర్‌గారు. ఆయన ముఖంలో పెల్లుబికిన ఆశాభంగం రవణ కళ్లబడిపోయింది. ఎంత మంచి వాడయినా స్టూడెంటు స్టూడెంటే కదా! తన రాకవల్ల ఏర్పడిన డ్రమేటిక్ సిట్యుయేషన్‌కి నవ్వురాగా బలవంతంగా దాన్ని అదిమి పట్టేడు. వెళ్లిపోతున్న సులేఖను మరొక్కసారి కళ్లతో జుర్రేసి రవణ వైపు దృష్టి మళ్లించిన ప్రొఫెసర్ గార్కి అతనణిచిపెట్టుకొంటున్న కొంటె నవ్వు కనబడిపోయింది. ఆయన కళ్లలో అగ్ని రగిలింది. ఆకోపాగ్నికి తట్టుకోలేక చూపులు దించేసుకొని ద్వారం దగ్గిర తాను విడిచిన పాదరక్షల మీదికి రవణ దృష్టి మళ్లించేడు. కాని ఆశ్చర్యం!! తన జోళ్లు లేవక్కడ. మరెవరిదో జత వుంది. అంటే ... ...సడన్‌గా రవణ బుర్రలో బల్బు వెలిగింది.

"సార్!...సార్! ఒక్క నిమిషం!" అని ప్రొఫెసర్ గారికి ఎపాలజీ చెప్పి హడావిడిగా బయటికి పరుగెత్తాడు. గేటుదాటి యింకా ఇరవై గజాలైనా వెళ్లలేదు సులేఖ ... ...యింతలో రవణ పిల్చిన పిలుపు వినబడి వెనక్కి తిరిగింది. రవణ ఏదో ఆతృతగా చెప్పేడు. సులేఖ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ చక్రాల్లాంటి కళ్లని గిరగిర తిప్పుతూ తన పాదాల వైపు చూసుకుంది. 'ఏమిటీ వింత' అన్న భావాన్ని సూచిస్తూ ఆమె చూపు క్షణకాలం తన పాదాల మీదనే వుండి పోయింది. తరువాత ఒక్కసారిగా యిద్దరూ గలగలా నవ్వుకున్నారు. తొడుక్కున్న జోళ్లని విడిచేసింది సులేఖ. ఆమె వద్దని నెత్తి మొత్తుకుంటూన్నా వినిపించుకోకుండా పరుగు పరుగున వెళ్లి ప్రొఫెసరు గారి ద్వారం దగ్గర వున్న ఆ రెండో జత జోళ్లని చేత్తో పట్టుకొని తెచ్చి మరీ సులేఖ పాదాల వద్ద ఉంచాడు రవణ. (యూనివర్సిటీ బ్యూటీ పాదరక్షలు క్షణకాలమైనా మొయ్యగలగడం ఎంతటి మహద్భాగ్యం అనుకొని వుంటాడు బహుశా) సులేఖ థేంక్స్ లాటిదేదో చెప్పినట్టుంది. 'అబ్బెబ్బె! అదేం అక్కర్లేదు' అంటున్నట్టుగా మెలికల్తిరిగి పోయాడు రవణ.

వాచ్‌టవర్‌లా వున్న కుర్చీ మీద కూర్చుని ఇదంతా గమనిస్తూనే వున్నారు ప్రొఫెసర్‌గారు. అడివి మనిషికి రావల్సినంత కోపం వచ్చింది అతనికి. కానయితే పిహెచ్‌డీలూ పదవులూ పాష్ క్లబ్బులూ ఫారిన్ టూర్లూ బోలెడు కుహనా సంస్కారాన్ని తెచ్చిపెట్టేయి కదా! ఎంతటి కోపాన్నయినా తుంగలో తొక్కేసి ముఖానికి చిరునవ్వు పరదా కట్టగలడు. అదే చేశాడిప్పుడూను. ముఖం తుడుచుకుంటూ లోపలికి వస్తున్న రవణని చూసి "సారీ రవణా! నాకర్జెంట్ ఎంగేజ్‌మెంటుంది. మరోసారి కలు" అని ఎంతో మృదువుగా అనేసి లోపలికి వెళ్లిపోయాడు.

నిజానికి ఆ క్షణంలో ఆయనకు దమ్మిడీ ఎత్తు పనిలేదు. లోపలికి వెళ్లి కుర్చీలో కూలబడి జరిగిన ఇన్సిడెంట్‌ని పునరాలోచన చేశారు. సిగరెట్టును కసిగా పీలుస్తూ ఆయన తేల్చుకున్నదేమిటంటే "ఈ రవణగాడు సులేఖ కోసమే వచ్చాడు. తనేమైనా అనుకుంటానని కాబోలు వేరే ఏదో పని వున్నట్టు నటించేడు. వీణ్ణి చూడగానే ఆ స్లట్ సులేఖ కూడా గభీమని లేచిపోయింది. ప్రొఫెసర్‌గారు చూస్తున్నారన్న భయమైనా లేకుండా వీడు దాని వెనకాలే పరిగెట్టి మంతనాలాడుకొని వచ్చేడు. వీడికి నిజంగా నాదగ్గిరే పని వుంటే నేనడిగినప్పుడు వాడి పనేదో చెప్పి ఏడవకుండా "సార్... ...సార్" అని నసగడం నన్ను చూసి నవ్వుకోడం చేస్తాడా!? కానీ కానీ...రాస్కెల్...ఇంత కాలం చదువు తప్ప వీడికి వేరే లోకం లేదని నేను భ్రమపడ్డానన్నమాట. వీడి వాలకం యిదీ అని తెలిసింది గనక ... ..." కోడి పిల్ల పీక నొక్కినట్టు సిగరెట్ నొక్కేసి యాష్‌ట్రేలో పడేశారు ప్రొఫెసర్ మదన్.

పరీక్షలయిపోయి రిజల్ట్సు కూడా వచ్చేయి. రవణకి యూనివర్సిటీ ఫస్టు మాట అటుంచి, కనీసం ఫస్టుక్లాసు కూడా రాలేదు. చావు తప్పి కన్ను లొట్టపోయినట్టు బొటా బొటి ఏభైశాతం సెకండ్‌క్లాసు వచ్చింది. ఈ క్లాసుతో వాడికే కాలేజీలోనూ ఉద్యోగం దొరకదు. ఫుల్ వుంటే - కాలేజీ ఉద్యోగమే కావాలంటే మాత్రం పెర్సంటేజ్ యింప్రూవ్ చేసుకోవలసిందే!

అందుకోసమని రవణ పరీక్షలకి వెళ్తూనే వుండాలి!

బహుశా ప్రొఫెసర్ మదన్ రిటైర్ అయ్యేవరకూ!!

*